

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఏపీలో ఎస్‌హెచ్‌జీలు నిర్వహిస్తున్న మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఎన్ని..?

- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఎన్నని, ముఖ్యంగా నెల్లూరులోని ఎన్ని ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. రాష్ట్రమంతటా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువుల మార్కెట్ లింకేజీలపై ప్రభుత్వం ఏవైనా అంచనాలు నిర్వహించిందా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, సాంప్రదాయ పరిశ్రమల పునరుద్దరణ నిధి పథకం వంటి పథకాల కింద స్వయం సహాయక సంఘాల నేతృత్వంలోని సంస్థలకు మద్దతుగా కేటాయించిన నిధుల వివరాలు కోరారు. అలాగే రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు అందుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత శిక్షణ, అందుకోసం కేటాయించిన నిధుల వివరాలు ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభాకరండ్లాజే లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల రిజిస్ట్రేషన్ కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను 01.07.2020న ప్రారంభించామని, అప్పటి నుంచి నవంబర్ 30.2025 నాటికి ఉద్యమ పోర్టల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌హెచ్‌జీల తరుపున 1,30,171 మైక్రో ఎంటర్‌ప్రైజెస్ నమోదు అయ్యాయని తెలిపారు. ఇక నెల్లూరులో 5,198 మైక్రో ఎంటర్‌ప్రైజెస్ నమోదు అయ్యాయన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద విస్తృతమైన క్షేత్ర అధ్యయనాలను నిర్వహించిందని చెప్పారు. దీని ద్వారా ఇ-కామర్స్, ఎస్ఏఆర్ఏఎస్ ప్రదర్శనలు, ఇతర మార్కెటింగ్ మార్గాల ద్వారా అమ్మకాలను ప్రోత్సహించడానికి విక్రేతలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు ఓఎన్‌డీసీ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో రాష్ట్రంలో 12864 మంది విక్రేతలు 31466 ప్రొడక్ట్స్‌కు రిజిస్టర్ చేసుకోగా 7114 మంది ఆన్‌బోర్డ్ అయ్యారని చెప్పారు. ఇక నెల్లూరు జిల్లాలో 541 మంది 1427 ప్రొడక్ట్స్ రిజిస్టర్ చేసుకోగా 260 మంది ఆన్‌బోర్డ్ అయినట్లు చెప్పారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్ ద్వారా ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ , ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంను అమలు చేస్తోందని, వ్యవసాయేతర రంగంలో కొత్త సూక్ష్మ సంస్థలను స్థాపించడంలో భావి వ్యవస్థాపకులకు సహాయం చేయడం ద్వారా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో ఈ పథకం అమలవుతోందని చెప్పారు. పీఎంఈజీపీ పట్టణ ప్రాంతాల్లో 15శాతం మార్జిన్‌మనీ సబ్సిడీని అందిస్తున్నారని చెప్పారు. ప్రత్యేక కేటగిరీకి గరిష్ట వ్యయం తయారీ రంగంలో అయితే రూ.50లక్షలు, సేవా రంగంలో రూ.20 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి కోసం నిధుల పథకం అనేది చేతి వృత్తుల వారి ఆదాయాల పెరుగుదల కోసం విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడానికి ఉద్దేశించిన పథకమని చెప్పారు. ఈ పథకంలో ఎస్‌హెచ్‌జీ సంస్థలకు ప్రత్యేక నిబంధన లేదని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ.. తన క్షేత్ర కార్యాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రయోజనాలపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎంఎస్ఎంఈ/ పర్శిమల విభాగాలు బ్యాంకులు, ఇతర ఎంఎస్ఎంఈ వాటదారుల సమన్వయంతో వర్క్ షాపులు, మీడియా సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అనేక అవగాహన ప్రచారాలను నిర్వహిస్తుందని చెప్పారు. దీని ద్వారా మహిళలతో సహా వాటదారుల భాగస్వామ్యం పెరుగుతుందని ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు, బ్యాంకుల గ్రామీణ శాఖల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఇటీవల హత్యకు గురైన పెంచలయ్య కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల గురువారం పరామర్శించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పెంచలయ్య కుటుంబ సభ్యులతో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక వేదనను అర్థం చేసుకొని, వారికి అన్ని విధాల త్వరితగతిన చట్టపరమైన సహాయం, రక్షణ అందిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీనిచ్చారు. పెంచలయ్య హత్యపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతుందని, ఇప్పటికే ప్రధాన ముద్దాయిలను అరెస్టు చేశామని, మిగిలిన వారి పాత్ర గురించి పూర్తిస్థాయిలో లోతుగా విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా పెంచలయ్య కుటుంబ సభ్యుల చేత గంజాయి వ్యతిరేక అవగాహన పోస్టర్లు ఆవిష్కరింపజేశారు.

## కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షణ

- అవసరమైన చర్యలు తీసుకోవాలని కండలేరు జలాశయ అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** దిత్వా తుఫాను నేపథ్యంలో భారీగా కురుస్తున్న వర్షాలకు కండలేరు జలాశయానికి ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో గురువారం కండలేరు జలాశయాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పరిశీలించారు. డ్యాం కెపాసిటీ, క్రస్ట్ గేట్లు, మోటారు పనితీరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 60 టీఎంసీల నీరు ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని ఎస్ ఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు కలెక్టర్ కు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నీటిని విడుదల చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కండలేరు సమీప గ్రామాల్లో రెవిన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సహాయక చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో అనూషకు సూచించారు. ప్రధానంగా పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లోని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బోట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్ ఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఆర్డీవో అనూష, పలువురు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## తిరుపతి జిల్లా వద్దు..నెల్లూరు జిల్లానే కావాలి

- రాపూరులో పెద్ద ఎత్తున ఆందోళన




**రాపూరు, డిసెంబరు 4 ప్రభాతవార్త** రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా గురువారం రాపూరులో రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు తిరుపతి జిల్లా వద్దు.. నెల్లూరు జిల్లానే మాకు కావాలి అంటూ రాపూరులో పెద్ద ఎత్తున ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. ఉదయం నుండి పెద్ద ఎత్తున భారీ వార్షం కురుస్తున్నా ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సిద్దలయ్య సెంటర్ నుండి పాత బస్టాండ్ మీదుగా తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేసుకుంటూ పెద్ద ఎత్తున వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలువురు వక్తలు మాట్లాడుతూ జిల్లా విభజన పట్ల ఏ రాజకీయ పార్టీ కూడా మాట్లాడక పోవడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వున్న సమయంలో రాపూరు మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ప్రయత్నించగా అప్పట్లో దివంగత రాపూరు మండల ప్రజా పరిషత్ ఆధ్యక్షుడు చెన్ను బాలకృష్ణా రెడ్డి ఆ సమయంలో మంత్రిగా వున్న ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో రాపూరును నెల్లూరులోనే కోనసాగేలా చేశారన్నారు. దీంతో పాటు వైసిపి ప్రభుత్వ హయాంలో రాపూరు,కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో పునర్విభజన సమయంలో కలపగా అప్పట్లో కూడా దివంగత చెన్ను బాలకృష్ణా రెడ్డి మండలంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలసి రాపూరులోని బాలజీ కాంప్లెక్స్ ముందు ఆందోళనలు నిర్వహించి సమస్యను అప్పటి ఎమ్మెల్యే, నేటి మంత్రి ఆనం రామనారయణ రెడ్డి ద్వారా మూడు మండలాలను నెల్లూరులో వుంచారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరలా ఈ మూడు మండలాలను తిరుపతిలో కలపాలని నిర్ణయించడం ఈ ప్రాంత వాసులను కలచివేస్తుందన్నారు. ఈ జిల్లా మార్పు వలన ఈ ప్రాంతంలో వుండే కండలేరులో నీటి పంపకాలలో సమస్యలు వస్తాయని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని తెలిపారు. రాపూరుకు నెల్లూరుతో ఎంతో విడదీయరాని సంబందాలు కలిగి వున్నాయని, పైగా రాపూరు నుండి నెల్లూరు 60 కిలోమీటర్లు కాగా తిరుపతి 100 కిలోమీటర్లు వుందని, ఎదైనా పని మీద జిల్ల కేంద్రానికి వెల్లాలంటే అనేక ఇబ్బందులు వుంటాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాపూరును ప్రజల అభిష్టం మేరకు నెల్లూరు జిల్లాలనే కోనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని రెవెన్యూ కార్యలయంలో ఆందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా రాపూరులోని వివిద పార్టీల నాయకులు,ప్రజలు పాల్గోన్నారు.

## ప్రజలకు సమర్ధమంతమైన పాలన, సత్వర పరిష్కార దిశగా డీడీఓ కార్యాలయం

- వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్






**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో వున్న నెల్లూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌సి బీదా రవిచంద్ర, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, యల్. శ్రీధర్ రెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి డి. వసుమతి, ఇతర సిబ్బందితో కలిసి జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ పాలన మరింత సులభతరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వారు ఈ రోజు రాష్ట్రంలో మొత్తం 77 డివిజనల్ డెవలప్మెంటు అధికారి కార్యాలయాలు ప్రారంబోత్సవ కార్యక్రమం వర్చువల్ గా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చే ప్రారంభించడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి 5 డివిజనలలో ఈ రోజు ప్రారంభోత్సవాలు జరిగి అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలోని 5 డివిజనలకు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ఏర్పాటుకు రూ. 47.50 లక్షలు, కార్యాలయపు ఫర్నిచర్, కంప్యూటర్ల కొరకు రూ. 20.00 లక్షలు వెరసి మొత్తం రూ.67.50 లక్షలను జిల్లా ప్రజా పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధులతో మంజూరు చేయడమైనది. అందులో నెల్లూరు డివిజన్ కార్యాలయం 13.5 లక్షల రూపాయలు తో ఏర్పాటు చేయడమైనదని అన్నారు. డివిజనల్ స్థాయి కార్యాలయాలు అందుబాటులోకి తీసుకొని రావడం వల్ల పంచాయతీ రాజ్ వ్యవస్థలో మంచి తోడ్పాటుగా వుంటుందని, అదే విధంగా ఈ కార్యాలయాలు పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు సమర్ధమంతమైన పాలన, సత్వర పరిష్కార దిశగా వుంటుందని అన్నారు. జిల్లాలోని అందరు డిడిఓలు అంకిత భావంతో పనిచేసి ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న అభివృద్ధి పథకాలు త్వరితగతిన అందేలా, సమస్యలు పరిష్కార దిశగా పనిచేయాలని ఆమె కోరారు.

## నెల్లూరు జిల్లాల్లో దంచి కొట్టిన దిత్వా తుపాను

- అనేక లోతట్టు ప్రాంతాలు జలమయం
- జలదిగ్బంధంలో అనేక ప్రాంతాలు
- పలుచోట్ల వాహన రాకపోకలకు అంతరాయం



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** గురువారం ఉదయం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి ఉరుములు మెరుపులతో భారీ నుంచి అతి భారీ వర్షం పడింది. దీంతో ఎటు చూసినా నగరం మొత్తం జలమయం అయిపోయింది. ఇప్పటికే 2 రోజులు నుండి కురుస్తున్న వర్షాలకే లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవ్వగా గురువారం ఉదయం పడిన వర్షానికి వాగులు మొత్తం పొంగిపోయాయి. ప్రాణ నష్టం లేకుండా ఉండేందుకు ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న అధికారులు ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఉన్నారు. గత రెండు రోజులు నుండి ఎడతెరపి లేకుండా నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేటు, రామలింగా పురం, మాగుంట లేఔట్ నందు నిలిచిన వర్షపు నీరును ఎప్పటికీ అప్పుడు యుద్ధప్రాతిపదికన మోటార్ల సహాయంతో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించి వాహన చోదకులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వెంటనే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దిత్వా తుపాను ప్రభావంతో నెల్లూరు, జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు నగరం, గ్రామీణంలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతోంది. దీంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలోని వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో చెరువులు నిండి జాతీయ రహదారిపైకి వరద ప్రవాహం చేరింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నెల్లూరులోని పేరారెడ్డిపల్లి, బీసీ కాలనీల్లోని ఇళ్లలోకి వరద చేరింది. దీంతో వాళ్ళని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇలాగే మరో రెండు రోజులు వర్షం పడితే జిల్లాకు తీవ్ర నష్టం చేకూరే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారులు అప్రమతం అవ్వడంతో నెల్లూరులో కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు జిల్లాలో పర్యటిస్తూ అధికార బృందంతో ఎక్కడ నీళ్ల నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.





## పోలీసుల పహారాలో మండలంలోని పలు గ్రామాలు



**కావలి, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం బిపిసిఎల్ కంపెనీకి కట్టబెట్టేందుకు కావలి రూరల్ మండలంలోని చెన్నాయపాలెం, రుద్రకోట, గుమ్మడిబొందల, మత్స్యకార గ్రామాలలో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళూరు మల్యాద్రి తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను తెలుసుకోవడానికి చెన్నాయపాలెంకు వెళ్ళడం జరిగిందన్నారు. వెళ్ళిన సమయంలో పోలీసులు అడ్డుకోవడం కూడా జరిగిందని గ్రామంలో ఆంక్షలు విధించారని, 30యాక్టు అమల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్యంగ హక్కులు, ప్రాథమిక హక్కులను పోలీసులు హరింప చేస్తున్నారని తెలిపారు. రైతులకు అండగా ఉండాల్సిందిపోయి బిపిసిఎల్ కంపెనీలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధంగా రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల వెంకయ్య, కావలి మండల కార్యదర్శి ఎం.రాధాక్రిష్ణయ్య తదితరులు

## సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, డిసెంబరు 4, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 31288.82 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 72.433 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.82 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## ప్రత్యేక కార్యాచరణతో రాప్ గ్యాంగులపై ఉక్కు పాదం

- జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** నకిలీ బంగారం, నకిలీ కరెన్సీ తదితర నేరాలకు పాల్పడే రాప్ ముఠాలను అణచివేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో నకిలీ బంగారం, దొంగ నోట్లు తదితర ట్రాప్‌లతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఠా మోసం చేసేందుకు అవలంబిస్తున్న పద్ధతులను ఆమె వివరించారు. తొలుత కొద్దిగా బంగారం ఇచ్చి నమ్మించడం, పెద్ద మొత్తంలో బంగారం కావాలంటే నగదు తీసుకురావాలని చెప్పడంతో బాధితులు నగదు తీసుకు వెళ్ళగా అక్కడ అప్పటికే ఏర్పాటు చేసిన తమ ముఠా సభ్యులను పోలీసుల రూపంలో ప్రవేశపెట్టి బాధితులను భయభ్రాంతులకు గురిచేసి నగదు దోచుకు వెళ్లడం, అనంతరం ముఠా సభ్యులు అందరూ కలిసి నగదు పంచుకోవడం జరుగుతోందని తెలిపారు. ఇదే తరహాలో దొంగనోట్ల విషయంలోనూ రూ. లక్షకు మూడు లక్షలు ఆశ చూపి ప్రజలను మోసం చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో కొందరు ముఖ్యమైన నేరగాల వివరాలను ఆమె వెల్లడించారు. కావలి పట్టణ తుఫాన్ నగర్‌కు చెందిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్ రెడ్డి అనే వ్యక్తి పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని, తన బంధువులు స్నేహితులతో ముఠాను ఏర్పాటు చేసుకుని, ప్రజలకు బంగారం తక్కువ రేటుకి ఇస్తామని చెబుతూ తొలుత తక్కువ రేట్‌కి నిజమైన బంగారాన్ని అందిస్తారని తెలిపారు. మరింత బంగారం కావాలంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకురావాలని చెప్పడంతో నమ్మిన బాధితులు ఎక్కువ మొత్తంలో నగదు తీసుకువెళ్లి వారు చెప్పిన ప్రదేశం వద్ద ఎదురుచూస్తుండగా, సుధీర్ అతని ముఠా అక్కడ చేరుకుని వారికి బంగారం ఇస్తున్నట్లు నటిస్తుంటారు. అప్పటికే వారు తయారు చేసుకున్న ముఠా సభ్యులు పోలీసు వేషధారణతో అక్కడికి చేరుకుంటారు. పోలీసులను చూసి ముఠా సభ్యులు భయపడుతున్నట్లుగా నటిస్తూ, బాధితులు కూడా భయపడేటట్లు వాతావరణం సృష్టిస్తారు. నకిలీ పోలీసులు బాధితుల వద్ద నగదు స్వాధీనం చేసుకోగా కేసులకు భయపడి బాధితులు పారిపోతుంటారు. తర్వాత అందరూ కలిసి నగదును పంచుకుంటారు. నకిలీ నోట్ల విషయంలోనూ ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతుంటారు. గతంలో సుధీర్ ముఠాలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న షేక్ హాసన్ అలియాస్ కార్తీక్ సుధీర్‌తో విభేదాల కారణంగా సొంతంగా ముఠాను ఏర్పాటు చేసుకుని ఇదే తరహా నేరాలకు పాల్పడుతుంటారు. ఇతనిపై రాష్ట్రవ్యాప్తంగా 13 చోట్ల పలు కేసులు నమోదయి ఉన్నాయి. అలాగే హసన్ వద్ద పనిచేస్తూ అతనితో విభేదించి మోనా సద్దాం హుస్సేన్ అనే వ్యక్తి కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడడం ప్రారంభించాడు. కేరళ ప్రాంతానికి రొయ్యలు చేపలు ఎగుమతి చేస్తూ, అక్కడి వ్యాపారస్తులకు తక్కువ ధరకు సరుకు ఇప్పిస్తానని రూ. లక్షల్లో నగదును అడ్వాన్స్ రూపంలో తీసుకుని సరుకు పంపకుండా వారిని ఇబ్బంది పెట్టేవాడు. కొందరు వ్యాపారులు ధైర్యం చేసి సరుకు కోసం వాకబు చేస్తే వారిని తన ముఠా సభ్యులతో కలిసి చంపుతానంటూ బెదిరించేవాడు. అలాగే సబల్పూర్ రాష్ట్రం నుండి నెల్లూరుకు వచ్చిన అరవ కామాక్షి కుటుంబం స్థానిక బోడిగాడి తోటలో పలు నేరాలకు పాల్పడేవారు. కామాక్షి తల్లి శాంతి గతంలో గంజాయి వ్యాపారం చేస్తుండేవారు. కామాక్షి కూడా తన తల్లి తరహాలోనే ఇతర రాష్ట్రాల నుండి గంజాయిని తీసుకొచ్చి నెల్లూరు నగరంలో విక్రయాలు జరిపేవారు. ఈ క్రమంలో ఆమెపై నవాబుపేట పోలీస్ స్టేషన్‌లోనూ సస్పెక్ట్ షీట్ నమోదై ఉంది. బోడి గాడి తోట వద్ద ఆక్రమణల తొలగింపు జరిపిన తర్వాత కామాక్షి కుటుంబానికి ఆర్డిటి కాలనీలో ప్రభుత్వం నివేశన స్థలం ఇల్లు మంజూరు చేసింది. అక్కడికి మకాం మార్చిన తర్వాత కామాక్షి కాలనీలోనూ గంజాయి వ్యాపారాన్ని విస్తృతం చేశారు. అక్కడ యువతను చెడు వ్యసనాలకు బానిసలు చేస్తూ, ప్రశ్నించే వారిపై తన కుటుంబ సభ్యుల ద్వారా దాడులు చేయించేవారు. ఈ క్రమంలో స్థానికుడైన సిపిఎం నేత సామాజిక కార్యకర్త కే పెంచలయ్య కామాక్షి దురాగాతాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆమెను, ఆమె అనైతిక కార్యకలాపాలకు సహకరించే కుటుంబ సభ్యులను కానీ కాలనీలోని అందరూ వ్యతిరేకించేలా పెంచలయ్య రోజు చైతన్యం చేస్తున్నాడంతో ఇక తమ ఆగడాలకు అడ్డు తగులుతున్నాడని నెపంతో పెంచలయ్యను నవంబర్ 27న కామాక్షి తమ్ముడు జేమ్స్ మరికొందరు కలిసి దారుణంగా హత్య చేశారు. వీరికి పాలకీర్తి రవి అనే గిరిజన నేత సహాయం చేసినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. ఈ సంఘటనలో ఏడు మందిని అరెస్టు చేయగా మరికొందరు పరారీలో ఉన్నారు. ఇదే తరహాలో బోగోలు మండలానికి చెందిన సముద్రాల దావీదుపై దొమ్మి, హత్యాయత్నం, దొంగతనం, అర్మ్స్ యాక్ట్ తదితర 11 కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. పెంచలయ్య హత్య కేసులో ఇతని పాత్ర పై కూడా విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

## సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా అనారోగ్య బాధితులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నాం

- కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన 19 నెలల్లో 533 మంది అనారోగ్య బాధితులకు 6 కోట్ల 50 వేలు ఆర్థిక సహాయం
- నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సహకారంతో 11 మందికి 9 లక్షల చెక్కుల పంపిణి
- అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, బిల్డింగులు కట్టడమే కాదు ఆపదలో ఉన్న వారి కన్నీళ్లు తుడవడమే
- 20 వ విడతగా కోవూరు నియోజకవర్గానికి చెందిన 45 మందికి 37 లక్షల రూపాయల చెక్కుల పంపిణి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.



**కోవూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త :** ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నా పేదవాడి ఆరోగ్యానికి ఏ లోటు రానీయకుండా అనారోగ్య బాధితులను ఆదుకుంటున్న సిఎం చంద్రబాబు నాయుడు గారికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ధన్యవాదాలు తెలియ చేసారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని ఆమె నివాసంలో 20 వ విడతగా కోవూరు నియోజకర్గానికి చెందిన 45 మందికి 37 లక్షల రూపాయలు, నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సహకారంతో మరో 11 మందికి దాదాపు 9 లక్షల విలువైన దిలీళినీ చెక్కులను బాధితులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి చేతులమీదుగా అందుకున్నారు.

### ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ

సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా సిఎం చంద్రబాబు నాయుడు గారు లక్షలాది మంది అనారోగ్య బాధితులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన 19 నెలల వ్యవధిలో కోవూరు నియోజకవర్గంలో 20 విడతలుగా 533 మంది అనారోగ్య బాధితులకు దిలీళినీ ద్వారా 6 కోట్ల 50 వేలు ఆర్థిక సహాయం అందించామన్నారు.

- ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నా పేదవాడి ఆరోగ్యానికి ఏ లోటు రానీయకుండా అనారోగ్య బాధితులను ఆదుకుంటున్న గొప్ప మనసున్న నాయకులని సిఎం చంద్రబాబు నాయుడు గారికి ఆమె ప్రశంసించారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, బిల్డింగులు కట్టడమే కాదని ఆపదలో వున్నోళ్ల కన్నీళ్లు తుడవడమే నిజమైన అభివృద్ధిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు అభివర్ణించారు.

పేదరికం అంటే డబ్బు లేకపోవడం కాదు, ఆపదలో సాయం చేసేవారు లేకపోవడమని ఆ లోటును చంద్రబాబు నాయుడు గారు తీరుస్తున్నారన్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యల వంటి పెద్ద ఆపదలు వచ్చినప్పుడు కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు కట్టలేని పేదలకు చంద్రబాబు నాయుడు గారు ఒక పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని ఇది మంచి ప్రభుత్వం, పేదలను ఆదుకునే ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు.

- ఈ కార్యక్రమంలో కొడవలూరు, విడవలూరు, కోవూరు, ఇందుకూరు పేట, బుచ్చిరెడ్డి పాళెం మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏటూరి శ్రీహరి రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, రాష్ట లీళీలీని డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బత్తల హరికృష్ణ, పాశం శ్రీహరి రెడ్డి, ఆవుల వాసు. రాష్ట చేనేత సంఘ నాయకులు కెవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి డి ఓ కార్యాలయాలను ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు



**చేజర్ల డిసెంబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ డిడిఓ కార్యాలయాలను గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో అమర్ చేజర్ల ఎంపీడీవో కార్యాలయం నందు వీక్షించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని వీక్షిస్తున్న చేజర్ల మండల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, మండల సొసైటీ అధ్యక్షులు బూదల్ల వీర రాఘవరెడ్డి, టిడిపి మండల పార్టీ ఎస్ సి సెల్ నాయకులు సోమవరపు హజరత్, అలాగే మండల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## 6న కోవూరు తాలూకా ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల నామినేషన్

**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త** కోవూరు తాలూకా ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షుడు ఎన్ ఆంజనేయ వర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలకు అధికారిగా పి రామిరెడ్డి సహాయ ఎన్నికల అధికారిగా మురళి జిల్లా పరిశీలకులుగా పి సతీష్‌ను నియమించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు

## నిండుకుండలా చెరువు ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు ఇరిగేషన్ రెవెన్యూ చొరవ



**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త.** దిత్వా తుఫానుతో కోవూరు మండలం అతలాకుతమైంది గత మూడు రోజు లకు వస్తున్న భారీ వర్షాలకుకోవూరు చెరువు నిండు కుండలా మారింది. చెరువుపొంగి నీరు రోడ్డు మీదకువచ్చే పరిస్థితి ఏర్ప డింది ఈ నేపథ్యంలో సమాచారం అందు కున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ ఎయ్యిశ్రీనివాసులు డిప్యూటీతాసి ల్దార్ బస్సు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు జెసిబి ద్వారాకాలువలో పేరుకు పోయిన తూటాకులను తీసివేసేలా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేశారు

## పనిచేసే ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టారు



**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రజానీకం పనిచేసే ప్రభుత్వానికే పట్టం కట్టారని మండల పరిషత్ అధ్యక్షురాలు టీపార్వతీ తెలిపారు కోవూరులోని మండల పరిషత్ సర్వసభ సమా వేశ మందిరంలో గురువారం ఉప ము ఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తూరు జిల్లా లో డీఎ ల్డీవో కార్యాల భవనాని ప్రారం భించారు ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా మండల పరిషత్ సరసభ సమావేశం మం దిరంలో ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు వీక్షించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన వాగ్దానం అమలు పరుస్తూ ముందుకు సాగు తుందన్నారు గత దశాబ్దాలకు పైగా పదోన్నతి నోచుకోని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పదోన్నతులు లభిం చింది అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు కార్యాల పర్యవేక్షకులు ఉషారాణి మం డల విద్యాశాఖ శాఖ వ్యవసాయ శాఖ విద్యాశాఖ వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు

## దిత్వా తుఫానుతో అతలాకుతం





## జలదిగ్బంధంలో కోవూరు

**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త.** గత నాలుగుగా కురుస్తున్న అకాల వర్షాలు తు ఫానుతో కోవూరు మండలం అతలాకు త మైంది. మండలంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న రహదారులు నీటిమడుగులో మునిగిపోయాయి గురువారం కురిసిన భారీ వర్షానికి సామాజిక ఆరోగ్యంగా నీటి సం ద్రంలో మునిగిపోయింది ఈ అకాల వర్షా లకు తుపాను కారణంగా కూలీ పనులు లేక తీవ్రఇబ్బందులకు గురయ్యారు అనేక ప్రాంతాల్లోని రహదారులు పాదాచారులు సైతం నడిచేందుకు వీలు లేకుండా నీట మునిగిపోయాయి పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులు మోటార్ పెట్టి నీరు తోడిన మరల అకాల వర్షం కారణంగా రహదారులు నీటితో నిండిపోయాయి మండలంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలు వర్షం నీటితో పూర్తిగా నిండిపోయి చెరువులు తలపింపజేస్తున్నాయి

## ఘనంగా అన్నదానం



**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త.** కొవూరులోని జాతీయ రహదారిలో కలిసి ఉన్న శ్రీ షిరిడి సాయి మందిరంలో గురువారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ని ర్వహించారు ఈ కార్యక్రమానికి విభే కర్త లుగా దాసరి రాజు హిమవతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు

## కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఆరంభమైంది

### రానున్నది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే



**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త** కోట యం ప్రభుత్వం వచ్చి 18 నెలల కా కమునుపే ఆ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతి రేకత ఆరంభమైనదని రానున్నది మరల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని శాసనమండలి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి తెలి పారు ఈ మేరకు గురువారం ఆయన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి వైసిపి పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన 60000 సంతకాల పత్రాలను ప్రత్యేక బాక్సులో ఏర్పాటు చేసి వాటిని రథంలో సాంప్రదాయ బద్ధంగా మేళ తాళాలు మంగళ వాయిదాల మధ్య ఊరేగిస్తూ నెల్లూరు పార్టీ కార్యాలయానికి సాగనంపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పోలీస్ యంత్రాంగం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అన్నారు 18 నెలలకాలంలో 30కి పైగా హత్యలు జరిగిన ప్రభుత్వంపై అధికారులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిపోతుందన్నారు గంజాయి ముఠా రాను రాను పెట్రేగిపోతున్న వద్దని చెప్పిన వారిని హత్యలు చేస్తున్న ఈ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు ఒకవైపు పోలీస్ యంత్రాంగం సక్రమంగా పని చేయాలి నిర్ణయించుకున్న ప్రజా ప్రతినిధులు వారిని తప్పుదారిన పట్టిస్తున్నారన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ తీరు మార్చుకోవాలని అన్నారు ఇది కేవలం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణఉద్యమం కాదని ప్రజల నుంచి ప్రభుత్వంపై ఆగ్రహ ఆవేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లా ఈ 18 నెలల కాలవ్యవధిలో హత్యల జిల్లాగా మారిపోయింది అన్నారు గంజాయి మద్య మత్తుతో హత్యలు విపరీతంగా సాగుతున్న ప్రభుత్వ యంత్రాంగం

## నల్లవాగు పై పెరిగిన నీటి ప్రవాహం రాకపోకలకు అంతరాయం



**చేజర్ల, డిసెంబర్ 4 ప్రభాతవార్త** దిత్వా తుఫాను ప్రభావంతో చేజర్ల మండలం లో గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని యనమదల గ్రామ సమీపంలోని నల్లవాగు పై నీటి ప్రవాహం పెరిగింది. దీంతో గురువారం రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగింది. వాగు సమీపంలోని యనమదల గ్రామ రైతులకు చెందిన నారుమళ్లు నీట మునిగాయి. నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో నారుమళ్లు మునిగిపోవడంతో రైతులు వాపోతున్నారు. వాగుకు రెండు వైపులా ఉన్న పొలాల్లోకి నీరు ప్రవేశించాయి. దీంతో నారుమళ్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన నారుమళ్ళకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా ఈ వాగు పొంగి ప్రవహిస్తున్న కారణంగా తూర్పు కంభంపాడు, యనమదల, కోటి తీర్థం, బిల్లుపాడు, కాకివాయి గ్రామాల కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో నెల్లూరుకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నల్లవాగు పై హై లెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## తుపానుకు నీట మునిగిన వరినారుమళ్లను పరిశీలించిన వ్యవసాయాధికారి వి. ప్రతాప్



**పొదలకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త** దిత్వా తుపాను వల్ల నీట మునిగిన వరి నారుమళ్లను పొదలకూరు మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా దిత్వా తుఫాను వల్ల పొదలకూరు మండలంలో సుమారుగా 264.4 ఎంఎం. వర్షపాతం నమోదుగా తుపాను కారణంగా దెబ్బతిన్న నారుమడులు సందర్శించారు. ప్రాథమిక సర్వే ఆధారంగా 2250 ఎకరాలకు సరిపడా నారుమళ్లు ,25 ఎకరముల నాటిన వరి పంట, 50 ఎకరముల పచ్చి శనగ పైరు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపుట జరిగిందన్నారు. ఇంకా వర్షం పెరిగితే నష్ట శాతం పెరిగే ఆకాశం ఉన్నందున రైతు సోదరులు నీటిని నిల్వ ఉంచకుండా గట్లు తొలగించి, వర్షం తగ్గిన తరువాత సూడోమోనస్ 5 గ్రాములో ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయుట వలన నారుకుళ్లు నివరించొచ్చు అని ఆయన తెలిపారు.

## తుఫాన్ బాధలో గిరిజనులకు అండగా

### - పేడూరు సిపిఎం అన్నదానంతో సేవా స్పృహ



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త** మండలంలోని పేడూరు పంచాయతీ పరిధిలో ఉన్న కొలిదిబ్బ గిరిజన గ్రామంలో సిపిఎం పార్టీ పేడూరు శాఖ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దిత్వా తుఫాన్ కారణంగా మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో పేడూరు గిరిజన కాలనీలో నివసించే గిరిజనులు పనులు లేక భోజనం దొరకక ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన సిపిఎం కార్యకర్తలు 400 మందికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో నిరుపేద గిరిజనులకు పనులు లేక, ఆహారం కూడా అందలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి కుటుంబానికి 30 కిలోల బియ్యం, వంట సామాగ్రి, 5,000 రూపాయల ఆర్థిక సాయం అందించాలని, వర్షాలు తగ్గే వరకూ ప్రభుత్వమే ఆహారం సరఫరా చేయాలని కోరారు. అవసరమైతే గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ కల్పించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మాచర్ల రాజయ్య, రవి, కందిపాటి రమణమ్మ, చిన్నబ్బయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట వద్ద వాగు ఉధృతికి ఆగిన రాకపోకలు



**నవాబుపేట(రాపూరు), డిసెంబరు 4ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీ పరిధిలోని నవాబుపేట గ్రామానికి వెళ్లే వాగు భారీ వార్షల కారణంగా పొంగి ప్రవ హిస్తుండటంతో గురువారం ఈ గ్రామంలోకి రాకపోకలు ఆగిపోయా యి. విషయం తెలుసుకున్న రాపూ రు మండల పార్టీ ఆధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి హుటాహుటిన ఈ ప్రదేశానికి చేరుకోని పరిస్థితిని చూసి ఇరిగేషన్ అధికారులకు పోన్ చేసి సమస్యను వారి దృష్టికి తీసుకోని వెల్లాడు. తహశిల్దార్ లక్ష్మీనరసింహం ఈ ప్రదేశానికి చేరుకోని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ టిడిపి నాయకుడు సమయం ప్రసాద్ మాట్లాడుతూ తమ గ్రామానికి వెల్లే దారిలో వున్న బ్రిడ్జి కిందికు వుండటంతో రాపూరు చెరువు కలుజు పారితే తమ గ్రామానికి వెల్లేందుకు దారి లేక తాము అవస్థలు పడు తున్నామని తమకు పాత బ్రిడ్జీ స్థానంలో నూతనంగా ఎత్తైన బ్రీడ్జిని నిర్మించాలని చెన్ను అశోక్ రెడ్డిని కోరా రు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి సమస్యను తీసుకోని వెల్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈయన వెంట మండల ప్రధాన కార్యదర్శి మురంరెడ్డి మధుసూధన్ రెడ్డి వున్నారు.

## మ్యాపింగ్ కార్యక్రమంపై అవగాహన



**కావలి, డిసెంబర్ 4 ప్రభాతవార్త** :కావలి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ అధ్యక్షతన కావలి మున్సిల్ కమీషనర్ జి.శ్రావణ ్కు మార్‌తో కలసి గురువారం స్పెషల్ ఇంటెన్సీఫ్ రివిజన్ మ్యాపింగ్ కార్యక్రమంపై అర్బన్ ఏఈఆర్ఓ సూపర్‌వైజర్స్, బిఎల్ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి అర్బన్ ఏఈఆర్ఓ సూపర్‌వైజర్స్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## పాముకాటుతో యువకుడు మృతి



**కావలి, డిసెంబర్4 ప్రభాతవార్త** :జలదంకి మండలం, గట్టుపల్లి చింతలపాలెం గ్రామానికి చెందిన యువకుడు బొబ్బల అరవిం ద్(26) పాముకాటుతో మృతిచెందాడు. గ్రామంలో పొలం పనుల నిమిత్తం బుధవారం వెళ్ళగా అక్కడ పాముకాటుకు గురి కావడం జరిగింది. విషయం తెలుసుకొన్న కుటుంబసభ్యులు వెంటనే అరవిండ్‌ను స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతని మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకొన్నాయి. జలదంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మండవ



**కావలి, డిసెంబర్4 ప్రభాతవార్త :** నవ్యాంధ్ర అభివృద్ది ప్రధాత, దివ్యాంగుల దైవం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేలు నుంచి 15వేల వరకు పించన్లు అందజేస్తున్న ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. ఆర్టీసిలో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషకరమన్నారు. దివ్యాంగులకు మండల కేంద్రాల్లో కాలనీలు ఏర్పాటు చేస్తే రుణపడి ఉంటామన్నారు. దివ్యాంగులకు ఆర్థిక సబ్సిడీ లైనుకు సబ్సిడిఇచ్చే పథకాన్ని కొనసాగిస్తాం అన్నందుకు దన్యవాదాలు తెలిపారు. అవరావతిలో దివ్యాంగులకు ప్రత్యేక భవనాన్ని కట్టడంగుర్తింపు ఇచ్చినట్లేనన్నారు. చంద్రబాబునాయుడు, లోకేష్‌లు టిడిపి పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రజాదర్బార్ ఏర్పాట్లు చేసినపుడు దివ్యాంగులకు తొలిప్రాధాన్యత కల్పించడం సంతోషకరమన్నారు.

## బీహార్ తరహాలో నెల్లూరు

### శాంతిభద్రతలు ఘోర వైఫల్యం.గంజాయికి ప్రభుత్వమే అండ



**కోవూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త** భారతదేశంలో బీహార్ అంటేనే హత్యలకు దోపిడీలకు నిలయంగా ఉండేదని ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఆ తరహాలో మారి శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందాయని మాజీ మంత్రి వైసిపి పిఏసి సభ్యులు ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో గజమెత్తారు కోవూరులోని వైసీపీ పార్టీ కార్యాలయంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భా గంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాకు ప్రభుత్వమే అండగా ఉందన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫియా గ్యాంగ్ పేట్రేగి పోయిందన్నారు ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లాలో గత 18 నెల కాల వ్యవధిలో 30 హత్యలు జరిగాయి అంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు శాంతి భద్రతలు పూర్తిగా చిన్నభిన్నమయ్యాయి అన్నారు జైలులో రౌడీ షీటర్లకు మాఫియా దన్నకు రాజభోగాలు అనుభవిస్తున్నారన్నారు గంజాయి వద్దు అన్నందుకే ఇటీవల సిపిఎం నాయకులు హత్య చేయడం ఎంతవరకు సబబు అన్నారు రాష్ట్రపతి ప్రధానమంత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేకంగా మాట్లాడుకుని చట్టంలో మార్పు తీసుకురావాల్సిన పరిస్థితి ఉందన్నారు ఆఫ్ఘనిస్తాన్ లో అమలవుతున్న చట్టం మన భారతదేశంలో కూడా అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని కేవలం వైసీపీ నాయకులను కార్యకర్తలను అరెస్ట్ చేయడమే తప్ప మాఫియా జోలికి పోవడం లేదన్నారు రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు

## భారీ వర్షాలకు రాపూరులో పొంగి ప్రవహిస్తున్న చెరువులు

### ..మండలంలో దాదాపుగా పూర్తిగా నిండిన చెరువులు

### ..భారీ వర్షాలతో దెబ్బతిన్న నారుమళ్ళు



**రాపూరు, డిసెంబరు 4ప్రభాతవార్త** దీత్వా తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వార్షలతో రాపూరు మండలంలోని పలు గ్రామాలలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రాపూరులోని చెరువులన్ని పూర్తిగా నిండిపోయాయి. ఈదల చెరువు చేరువు కలుజు పెద్ద ఎత్తున వస్తుండటంతో రాపూరు..పెంచలకోన పాత రోడ్డుపై నీరు పొంగి ప్రవహిస్తుంది. వర్షం ప్రభావంతో గోనుపల్లి లో రోడ్డు కోటకుపోయింది. పంగిలి గ్రామా రహదారి సైతం వర్షానికి కోట్టుకోని పోయింది. దీంతో పాటు పలు గ్రామాలలో వర్షపు నీరు ప్రమదకర స్థాయిలో వాగులు ప్రవహిస్తున్నాయి. రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి గ్రామాలలో వర్షపు పరిస్థితి తెలుసుకుంటూ ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేస్తూ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. తహశిల్దార్ద లక్ష్మీనరసింహం, ఎస్ఐ యం. వెంకట రాజేష్‌లు వరద ప్రవాహం ఎక్కువగా వున్న ప్రదేశాలను సందర్శిస్తూ వర్షపు నీటిలోకి ఎవ్వరూ ప్రవేశించకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

## పైలట్ బేసెస్‌గా ముత్తుకూరు మండలం



**ముత్తుకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త** రాష్ట్రంలో నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలాన్ని పైలట్ బేసెస్ గా తీసుకోవడమైందని డిపిఎం లివ్లీహుడ్ మధుసూధన్ తెలిపారు. గురువారం మండలంలో విఓఎలు, ఎంఈడి, సిఆర్పిలు కలిసి సంఘమిత్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 మంది సిఆర్పిలను ఎంపిక చేసి హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డిలో శిక్షణ పూర్తి చేయడమైందన్నారు. వీరు ఒక్కొక్కరికి 30 మందిని చిరువ్యాపారులుగా తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించడమైందన్నారు. ముత్తుకూరు మండలానికి 10 మంది సిఆర్పిలు 300 మందిని 18 నెలల కాలంలో ఎంటర్‌పెన్యూర్స్‌గా తయారు చేయడం వీరి బాధ్యతన్నారు. దీనికి ప్రతి విఓఎలు, సిసిలు సహకారం అందించాలని తెలిపారు. ఈ మండలంలో సాధించిన ప్రగతి ఆధారంగా రాబోయే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మరొకొన్ని మండలాల్లో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎల్‌హెచ్ నాగేంద్ర ప్రసాద్, మండల ఏపిఎం నిర్మలమ్మ, సిసిలు, విఓఎలు, ఎంఎస్ అకౌంటెంట్, ఎఫ్‌పిఓసిసి, ఎఫ్‌పిఓ అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

## గదులనిర్మాణంలో ఎమ్మెల్యే కృషి ప్రశంసనీయం

### -పునర్నిర్మాణ కమిటీ సభ్యులు



**వలేటివారిపాలెం డిసెంబరు 4, ప్రభాతవార్త** కందుకూరు పట్టణం లోని శ్రీఅంకమ్మ తల్లి దేవాలయ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ప్రశంసనీయమని ఆలయపునర్నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు. ఆయన కృషివలన ఆలయానికి నెలకు రూ.2.03లక్షలు మేర ఆదాయం సమకూరిందని సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు వెంకటమురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు మొదటి నెల 18 రూముల అద్దె రూ.2,03,500లుఆదాయం జమ అయినట్లు చెప్పారు. గురువారం వలేటివారిపాలెంలో ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేని కలిసి వివరించారు. కందుకూరు గ్రామ దేవత భక్తుల పాలిట కొంగుబంగారమైన శ్రీ అంకమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం అత్యంత సుందరంగా మనోహరంగా ఆధ్యాత్మికతతో భక్తుల హృదయాలను తాకే విధంగా రూపుదిద్దుకుందని వివరించారు. దేవాలయానికి అనుబంధంగా అనివేటి మండప నిర్మాణ పనులు సైతం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. దేవాలయానికి శాశ్వత ఆదాయం సమకూర్చే విధంగా రూముల నిర్మాణానికి బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. ఈ రూముల నిర్మాణంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అందించిన సహాయ సహకారాలు మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అంకమ్మ తల్లి దేవాలయ కార్య నిర్వహణ అధికారి కార్తీక్‌తోపాటు పలువురు ఉన్నారు.

## చేపల వేటకు వెళ్ళి వ్యక్తి మృతి

**కావలి, డిసెంబర్4 ప్రభాతవార్త :** చేపల వేటకు వెళ్ళి వ్యక్తి చెందిన సంఘటన ఒటూరు గ్రామంలో జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు రూరల్ మండలంలోని ఒటూరు గ్రామానికి చెందిన పొన్నాడి ఏడుకొండలు గురువారం సుమారు మద్యాహ్నం 1గంట సమయంలో చేపల వేటకు వెళ్ళి ఒటూరు సముద్రం ఒడ్డున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య బల్లమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి నలుగురు ఆడపిల్లలు కలరు. మృతుని కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకోవానలి పలువురు కోరుతున్నారు.

## గండిపాలెం జలాశయంలో గల్లంతైన మృతదేహం లభ్యం

**ఉదయగిరి, డిసెంబర్ 4, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయంలో రెండు రోజులు క్రితం ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన సారబ్ అనే యువకుడు ఉదయగిరి మండలం గండిపాలెం జలాశయంలో గల్లంతైన విషయం తెలిసిందే. ఉదయగిరి ఎస్సై ఆల శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు అగ్ని మాపక సిబ్బంది గల్లంతైన మృతదేహం కోసం రెండు రోజుల నుంచి వెలికితీసేందుకు ప్రయత్నాలు చేశారు. గురువారం మరోసారి ప్రయత్నం చేసి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## బిజెపి నాయకులు కీర్తి శేషులు రామిశెట్టి భాస్కర్‌రావు 16 వవర్ధంతి

**బుచ్చి, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం అర్బన్‌లో భారతీయ జనతాపార్టీ సీనియర్‌నాయకులు బుచ్చిరెడ్డిపాళెం బిట్-2 మాజీ ఎంపిటిసి సభ్యులు,బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు వైస్ చైర్మన్ కీర్తి శేషులు రామిశెట్టి బాస్కర్ రావు 16వ వర్ధంతి బుచ్చిలోఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రామిశెట్టి బాస్కర్‌రావు విగ్రహానికి బిజెపి



నాయకులు,అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని అన్ని అనాధ ఆశ్రమాలకు బికెన్ బిర్యాని వండి పంపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి మోహన్‌బాబు, బిజెపి సీనియర్ నాయకులు మాచవరం శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ మండల బిజెవైఎం అద్యక్షులు తానా మణికంఠ వెలుగోటి శివ, తిరువల్లూరు అరుణ్‌కుమార్, నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలకు కుర్చీలు వితర

**బిట్రగుంట, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికలఉన్నత పాఠశాలకు గురువారం పాత బిట్రగుంటకు చెందిన ఎన్నా బత్తిన రమణయ్య సుమారు 5000 రూపాయలు విలువ చేసే కుర్చీలను బహుకరించినట్లు ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంగాధర్ తెలిపారు. దాతను ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు కూడా అభినందించారు



## గిరిజన కాలనీ జలమయం బిక్కు బిక్కు మంటున్న గిరిజనులు

**మనుబోలు డిసెంబర్ 4 ప్రభాతవార్త :** దిత్వా తుపాన్‌తో కురుస్తున్న భారీ వర్షాలకు,దీనితోడు కండలేరు జలాలు దిగువ ప్రాంతాలకు విడుదల చేయడంతో గురువారం సాయింత్రం మనబోలు చంద్రమౌళి నగర్ గిరిజన కాలీనీ జలమయమైంది.సాయింత్రం అయ్యేసరికి వరదనీటి స్ధాయి పెరుగుతుండడంతో గిరిజనులు బిక్కుబిక్కు మంటు ఇళ్ళలోనే తలుపులు వేసుకొని తలదాచు



కుంటున్నారు. అధికారులు ఎవరు ఇటువైపు చూడలేదని తమ పరిస్దితి ఏమటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి గిరిజనులను తరలించాలని పలువురు కోరుతున్నారు.

## అతుకులతో ప్రయాణీకుల బతులకులు ఇంతేనా?

**కొడవలూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** కొడవలూరు రైల్వేగేటు వద్ద నుంచి మండల కేంద్రం వరకు రోడ్డు గుంతలుగా ఏర్పడ్డాయి. వాహనదారులు రాకపోకలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్తితి ఏర్పడిందని ప్రయణీకులు వాపోయారు. ఈ రోడ్డున ఎంతోమంది నాయకులు, అధికారులు, వస్తువెలుతుంటారే తప్పా పట్టించుకునే వారు లేరా అని వాహనదారులు జిల్లా అధికారులను వేదు కొంటున్నారు. ఇటీవల అంతర్గత రోడ్డుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించడం అందులో బాగంగా కొడవలూరు రైల్వేగేటు వద్ద నుంచి పనులు ప్రారంభించడం జరిగింది. కాంట్రాక్టర్లు నాణ్యతలేని మెటీరియల్‌తో తూతూ మంత్రంగా గుంతలను పూడ్చడదంత కురుస్తున్న వర్షాలకు మట్టిలా కరిగి రోడ్డు ప్రమాదకరమైన గుంతలుగా దర్శనమిస్తున్నాయి.

## వెంకన్నపాళెం వద్ద రోడ్డుపైన ఉధృతంగా వరదనీరు

**మనుబోలు డిసెంబర్ 4 ప్రభాతవార్త :** దిత్వా తుపాన్‌తో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతి పెరిగింది. దీనితో మండలంలోని వెంకన్నపాళెం గ్రామ సమీపంలో గురువారం ఉదయం వరదనీరు రోడ్డుపైన ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అటువైపు ఎవ్వరు వెళ్ళకుండా తహసిల్దారు రమాదేవి ఆదేశాలతో వీఆర్ఓ శ్యామ్



,రమేష్ కంచెవేసి మార్గాన్ని మూసివేశారు.దీనితో ఈ మార్గం గుండా వాహనాలు నిలిచిపోయాయి. వెంకన్నపాళెం బద్దెవోలు ,పిడూరుపాళెం, పల్లెపాళెం, కట్టువపల్లి ,కొలనుకుదురు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## ఆర్‌ఎస్‌కె భవనంలో డిడిఒ కార్యాలయం ప్రారంభం

**సీతారామపురం డిసెంబర్ 4ప్రభాతవార్త :** రాష్ట్ర డిప్యూటి సిఎం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డివిజనల్ డవలప్‌మెంట్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం సీతారా మపురం మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌కె భవనంలో డిడిఒ కార్యాలయాన్ని ఇంచార్జి ఎంపిడిఒ ఎం చంద్రశేఖర్ ఇతర శాఖల అధికా రులు, ప్రజాప్రతినిదులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. డిడిఒ కార్యాలయాల ప్రారంభో



త్సవం సందర్బంగా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రసంగాన్ని తిలకించారు.ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతు అన్ని శాఖల అధికారుల సమన్వయం పెరగడం కోసం డిడిఒ కార్యాలయం ఉపయోగపడుతుందని అన్నారు.పంచాయితీ రాజ్ వ్యవస్ధలో అభివృద్దితో కూడిన మార్పుల కోసం డిడిఒ ద్వారా జరుగుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సోమనబోయిన రాజశేఖర్, డిప్యూటి ఎంపిడిఒ శివప్రసాద్‌రావు ,టిడిపి మండల మాజీ అద్యక్షులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు,మండల టిడిపి యూత్ అద్యక్షులు పసుపులేటి వికాస్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్టేషన్ ముచ్చట 8ఏళ్ళకే తీరిపోయింది తప్పిన పెనుప్రమాదం

**విడవలూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** స్థానిక మోడల్ పోలీస్‌సేటషన్ సీలింగ్ తెల్లవారుజామున కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం పెనుప్రమాదం తప్పింది. విషయం తెలియగానే స్థానిక ఎస్ఐ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పరిశీలన చేసి పై అధికారులకు తెలియపరిచారు. ఏఆర్‌డిఎస్‌పి చంద్రమోహన్ పోలీస్‌స్టేషన్ పర్యవేక్షించారు. టిడిపి ప్రభుత్వంలో 2018లో మోడాల్ పోలీస్‌స్టేషన్ పేరుతో భవనాన్ని



నిర్మించారు. అప్పటి పరిపాలకులు కాంట్రాక్టర్లకు అప్పగించడం వారు కట్టుదిట్టమైన పోలీస్‌సేటషన్ భవనానికి స్లాబ్ నిర్మించక దర్మాకోల్ ఏర్పాటు చేయడంతో కూలిపోయిందని ప్రజలు చర్చించుకొంటున్నారు. 8ఏళ్ళకే మోడల్ పోలీస్‌స్టేషన్ ఇలా జరగడం ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది.

## ఉదయగిరి మండలంలో గ్రామ కమిటీల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**- ప్రజల వద్ద నుండి వినతుల స్వీకరణ - సమిష్టిగా పనిచేద్దాం.. పార్టీ అభ్యున్నతికి తోడ్పడదాం**

**ఉదయగిరి, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని పలు పంచాయతీలలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామాల అభివృద్ధికి పార్టీలో తేడాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలనే



పిలుపునకు ఆయన అందించారు. అభివృద్ధి పథంలో గ్రామాలు దూసుకెళ్లాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. గురువారం ఉదయగిరి మండలంలోని గంగులవారిచెరువుపల్లి, గంగులవారి చెర్లోపల్లి పంచాయతీలలో టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు కోసం జరిగిన సమావేశాలకు కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాలో ముందుగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి నిస్వార్థంగా పని చేసిన బూత్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు, అలాగే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న నాయకులను ఎమ్మెల్యే స్వయంగా అభినందించారు. వారి సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ పార్టీ తరుపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తదుపరి గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు భూ సంబంధిత సమస్యలు, గ్రామంలో మౌలిక వసతుల లోపం, సీసీ రోడ్ల అవసరం, తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి విషయాలను గ్రామ ప్రజలు వివరించారు. వాటిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ఈ సమస్యల పరిష్కారానికి అత్యంత వేగంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం టీడీపీ మండల నాయకులు, గ్రామ నాయకుల సమక్షంలో ప్రతి పంచాయతీలో గ్రామ కమిటీలను సక్రమంగా ఎంపిక చేసి ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతం కోసం బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి 94 వేలు అందజేత

**బుచ్చి డిసెంబర్ 4 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం 17 వవార్డుకు చెందిన చేపూరు సుహాసిని అనే మహిళకు 94 వేలు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అందజేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర చేనేత శాఖ డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణ, యువత నాయకులు వింజం మహేష్‌నాయుడు ఈ సందర్బంగా ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.




## వైద్యం అందక మృతి చెందిన ఘటన పై విచారణ

**సీతారామపురం డిసెంబర్ 4 ప్రభాతవార్త :** ఇటీవల సీతారామపురం బెస్తకాలనీకి చెందిన మారుబోయిన వెంకటరమణా అనే వ్యక్తి గుండె పోటు రావడంతో కుటుంబసభ్యులు స్దానిక పిహెచ్‌సికి తరలించగా పిహెచ్‌సిలో సమయానికి సిబ్బంది ఎవ్వరు లేకపోవడంతో సమయానికి వైద్యం అందక మృతి చెందిన విషయం తెలిసిందే . ఈఘటన గురించి పలు వార్తకధనాలు వెలువడడంతో జిల్లా ఉన్నతాధికారులు గుండెపోటు మరణంపై జిల్లా క్షయ,టిబి, ఎయిడ్స్,నియంత్రణ అధికారి షేక్ ఖాదర్‌వలి సీతారామపురంలో విచారణ చేపట్టారు.సీతారామపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిబ్బంది మరియు, బాధిత కుటుంబసభ్యుల నుండి వివణలు తీసుకొని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని విచారణ అధికారి తెలియజేశారు.




## పాఠశాలకు కంప్యూటర్లు బహుకరించిన పూర్వ విద్యార్థులు

**ఇందుకూరుపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం ముదివర్తి పాలెం పాఠశాలకు పూర్వ విద్యార్థుల తరుపున 3 కంప్యూటర్లు, టేబుల్స్, ఎలక్ట్రికల్ బెల్‌లను అందజేశారు. రేపటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్ధులకు సాయంత్రం పూట అదనంగా స్టడీ అవర్స్ పెట్టడం జరుగుతుంది. ఆ సమయంలో విద్యార్థినీ, విద్యార్ధులకు స్నాక్స్ లాంటి ప్రోటీన్ బేస్ పదార్థాలు అందించడం జరుగుతుంది. రేపటి



నుంచి పాఠశాలకు దూరంగా నివాసం ఉన్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆటో ద్వారా పాఠశాలకు తీసుకొనివచ్చేందుకు ఆటోను కూడా సమకూర్చడం జరిగింది. కాబట్టి ఇలాంటి కార్యక్రమాలను, సౌకర్యాలను ఏర్పాటు చేసి రాబోయే విద్యా సంవత్సరంలో పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాల్సిన బాధ్యతను పూర్వ విద్యార్థులమైన మనం తీసుకుని తద్వారా పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలి. కార్యక్రమాలను చేయుటకు పూర్వ విద్యార్థులు తమవంతు సహాయ సహకారం, అది ఏ రూపంలో అయినా అందించాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పొట్టేపాలెం కలుజులో పడి ఓ యువకుడు మృతి

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం కలుజులో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు పాత పెద్దాసుపత్రి ప్రాంతం పొర్లు కొట్టకు చెందిన షేక్ మెహరాజ్(18) గురువారం మధ్యా



హ్నం ఉధృతంగా ప్రవహిస్తున్న కలుజులో నడిచి వెళ్తుండగా ఫిట్స్‌కు గురై ఉన్నపళంగా కలుజు నీటిలో పడిపోయాడు. దీంతో ఆ నీటిలోనే ఆ యువకుడు మట్టి కట్ట వద్దకు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ప్రజలు ఆ యువకుడ్ని నెల్లూరు జీజీ హెచ్‌కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రూరల్ సీఐ, రూరల్ ఎంఆర్ఓ కృష్ణ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని యువకుని మృతి ఘటనపై ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న మృతుని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## కలుషిత తాగునీటితో ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం

**- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సమాయత్వం కావాలి**

**నెల్లూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త -వైద్యం :** భారీ వర్షాలు వరదల నేపథ్యంలో కొత్త నీరు భూగర్భ జలాల్లోకి చేరింది. దీంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పల్లె ప్రాంతాల్లో బోరు బావుల నుంచి రంగు మారిన నీరు వస్తోంది. ఈ తరుణంలో తాగునీరు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మరో వైపు దిత్వా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో వీధులన్నీ జలమయమై కలుషిత వాతావరణం ఏర్పడింది. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటి జాగ్రత్తలపై కూడా ప్రజలను చైతన్య పరచాల్సి ఉంది. ఇటు నెల్లూరు నగరంలోనూ అటు పల్లె ప్రాంతాల్లోనూ ఇప్పటికే తాగునీటి బోర్లలో రంగు మారిన నీరు వస్తోంది. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ సమాయత్తమై ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో ప్రజలను చైతన్యపరచాల్సి ఉంది.



## మెగా పీటీఎం 3.0పై అవగాహన

**వింజమూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తేదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పీటీఎం 3.0పై శుక్రవారం ఉదయం 9గంటల నుండి 12.45 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహింపబడుతుందని మండల విద్యాశాఖ అధికారులు పి.రమేష్, ఎం.మధుసూదన్‌రెడ్డిలు తెలియజేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విధిగా తమకు కేటాయించిన ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి స్వాగతం పలికి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎల్ఈఏపీ యాప్ నందు మూడు ఫొటోలను కార్యక్రమం ముగించిన తర్వాత యాప్ నందు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు ఉపాధ్యాయినీలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. 9 నుండి తల్లిదండ్రులని దాతలను పూర్వ విద్యార్థులను ఎస్ఎంఎస్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికార ప్రతినిధులను పిలిపించి స్వాగతం పలికించాలన్నారు. 10 గంటలకు పైన హెచ్‌పీసీ పై చర్చ చర్చ అసెస్మెంట్ బుక్‌లెట్స్ పై చర్చ ఎఫ్ఎల్ఎస్ బేసిక్ లైన్ టెస్ట్ పై చర్చ తల్లిదండ్రులకు లీపు యాప్ ఉపయోగాలు తెలియజేయడం 11 నుండి టీఎల్ఎం లైబ్రరీ ల్యాబ్ ప్రదర్శన తదుపరి వక్తల ప్రసంగాలు నివేదికలు మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించడం తదితర అంశాలు ఉంటాయని తెలిపారు. కావున ప్రధానోపాధ్యాయులు శ్రద్ధగా కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.



## సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవ కమిటీచే అన్నప్రసాద వితరణ



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిరుపేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని నిరుపేదలకు అన్న ప్రసాద వితరణ చేయడం జరిగిందని కమిటీ అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి. ఈశ్వర్ సాయి, బి. వెంకటేశ్వర్లు, ఎమ్. కుమార్, అంజిరెడ్డి ల దాతృత్వంతో నిరుపేదలకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగిందన్నారు. మానవసేవే మాధవసేవగా భావించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శాసనసభ్యులు సోమిరెడ్డి రాక

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని భవ్యంగా నిర్వహించనున్న నేపథ్యంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నేడు తోటపల్లి గూడూరు హై స్కూల్‌కు రానున్నారని మండల అధ్యక్షులు కోణితం రఘుబాబు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులకు ప్రత్యేక స్వాగతం ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు.

## 6న కోదండరామస్వామి దేవస్థానం కౌలు బహిరంగ వేలం

**బుచ్చి డిసెంబర్ 4 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం కోదండరామస్వామి దేవస్ధానంకు సంబందించి కందుకూరు మండలం,కోవూరు గ్రామంలో మెట్ట భూములు కలవని ఆలయ వ్యవస్ధాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలిపారు.ఈభూములకు సంబందించి 6వ తేది ఉదయం 11 గంటలకు ఒంగోలు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## బాల్య వివాహ రహిత జిల్లాగా నెల్లూరు జిల్లాగా లక్ష్యం

**నెల్లూరు సిటీ, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** బాల్య వివాహ రహిత జిల్లాగా నెల్లూరు జిల్లాను చేయడమే లక్ష్యమని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిని బి. హేనా సుజన్ తెలిపారు. గురువారం నెల్లూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రాంగణం నందు భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వ



ర్యంలో దేశవ్యాప్తంగా బాల్య వివాహ రహిత భారత్ కోసం 100 రోజుల అవగాహన కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, సిడిపిఒలు, సూపర్వైజర్లు, ఎడబ్ల్యూ డబ్ల్యూలు, పోలీసులు, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, డిఎంహెచ్ఒ, మెప్మా, డిఆర్‌డిఏ అధికారులు వెల్ఫేర్ డిపార్ట్మెంట్, ప్రతి నిధులు తదితర స్టేక్ హోల్డర్లు పాల్గొని బాల్య వివాహ నిర్మూలనకు కట్టుబడి ఉండేందుకు ప్రత్యేక చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ ప్లెజ్ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శాఖ తమ పరిధిలో బాల్యవివాహాలు పూర్తిగా నిర్మూలించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బాల్య వివాహం చట్టవిరుద్ధమని, ఇది పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి గ్రామం, వార్డులో మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, స్కూల్ డ్రాప్వట్స్, టినేజ్ ప్రెగ్నెన్సీలు, లేకుండా చూడాలని స్టేక్ హోల్డర్లు తమ శాఖా స్థాయి చర్యలు, అవగాహన కార్యక్రమాలు, పాఠశాలలు, గ్రామాలు, ,దిదీళీ కేంద్రాల్లో చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా జిల్లా స్థాయిలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ లక్ష్య సాధనకు సమన్వయ చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ వి అనురాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి సురేష్, నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ అరుణ, నెల్లూరు ప్రాజెక్టు సూపర్వైజర్స్, ఐసిడి ఎస్ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదలకూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పొదలకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** దిత్వా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున పొదలకూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ ఏ. శివరామకృష్ణారెడ్డి తెలిపారు. పొదలకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ శివరామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ళ వద్ద నుండి బయటకు రావద్దని సూచించారు. దాదాపుగా మండలంలోని అన్ని వాగులు పొంగి పొర్లుతున్నాయని, పొర్లి ప్రవహించే చప్టాలు, రోడ్లు దాట వద్దని తెలియజేశారు. ప్రమాదాలు జరగకుండా తాగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. లోతట్టు కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సురక్షిత ప్రాంతా లకు తరలి వెళ్లాలన్నారు. పెన్నా పరివాహక గ్రామాలైన సూరాయపాలెం, విరువూరు, మహమ్మదాపురం గ్రామాలలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షం తగ్గే వరకు సురక్షితమైన భవనాలలో ఆశ్రయం పొందాలని సూచించారు. తక్షణ సహాయం కోసం పొదలకూరు పోలీస్ వారిని గానీ రెవిన్యూ శాఖ అధికారులను గాని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.




## సేవామూర్తి అమర్నాథ్.. సర్పంచ్‌కి సరైన వ్యక్తి!

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** మండలంలోని కోవెరపాలెం గ్రామంలో జనసేన నాయకులు ముత్యాల అమర్నాథ్ బాబు పై ప్రశంసల జల్లు కురుస్తోంది. ప్రతి ఒక్కరి సమస్యకు వెంటనే స్పందించే స్వభావం ఆయనది. పార్టీ తేడా చూడకుండా అందరినీ కలుపుకుంటూ గ్రామాభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడు. ఏ ఇంట్లో ఆపద వచ్చినా ముందుండి తోడ్పడే అమర్నాథ్, ఇప్పుడు గ్రామంలో మరొక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రమాదం జరిగిన వారికి తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ సృష్టించి, దానిలో తొలుత తానే రూ.30,000 జమ చేసి, మిగతా సాయం దాతల ద్వారా సేకరించి బాధిత కుటుంబాలకు అందించే సేవా



కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాడు. ఇలాంటి సహాయక కార్యక్రమాలు గతంలో ఎన్నో చేసిన అమర్నాథ్‌కు పెద్దలు, యువకులు, మహిళలందరిలోనూ ప్రత్యేకమైన గౌరవం ఉంది. గ్రామం కోసం హృదయంతో పని చేసే వ్యక్తి ఇతనే అని ప్రజలు ఒకే స్వరంతో అంటున్నారు. రాబోయే ఎన్నికల్లో అమర్నాథ్ సర్పంచ్ అయితే.. కోవెరపాలెం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుంది అని స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## డి.డి.ఓ కార్యాలయాల ప్రారంభం

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా డిడిఓ కార్యాలయాల ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అనుసరించి టిపి గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, పిఆర్



ఏఈ, ఇతర శాఖల అధికారులు కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ డిడిఓ కార్యాలయాల ప్రారంభం గ్రామీణ పాలనలో పారదర్శకత పెంపుకు తోడ్పడుతుందని. పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత ప్రభావవంతంగా పనిచేసేందుకు ఇది కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. అంతేకాక, గ్రామీణ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం, ప్రజా సేవల అందుబాటు పెంపు వంటి అంశాల్లో కూడా ఈ కార్యాలయాల ఏర్పాటుతో మరింత చురుకుదనం వస్తుందని ఆయన తెలిపారు.

## ఎన్‌జిఒ సంఘ తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

**ఆత్మకూరు, డిసెంబరు4ప్రభాతవార్త:** ఎపి ఎన్‌జిఒ సంఘం ఆత్మకూరు తాలూకా యూనిట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం 10.30 గంటల నుండి పిడబ్ల్యుడి కార్యాలయ ప్రాంగణంలో జరిగాయి. ఈసందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల



అధికారి ఎ.వి.కృష్ణకుమార్ , నెల్లూరు జిల్లా జాయింట్ సెక్రటరీ సహాయ ఎన్నికల అధికారి సి.హెచ్ .రామకృష్ణారెడ్డి, నెల్లూరు సిటీ అధ్యక్షులు, ఎన్నికల పర్యవేక్ష ణాధికారి ఎల్.పెంచలయ్య , నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకటించారు. నూతన అధ్యక్ష రాలిగా బి.శైలజ,సహాధ్యక్షులుగా ఎస్.కె. ముజీబ అహ్మద్,ఉపాధ్యక్షులుగా కె.భాస్కర్‌రెడ్డి, కె.రఘురామ్, కె.ఉత్త య్య, కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, సంయుక్తకార్యదర్శులుగా ఎం.ప్రతాప్‌కుమార్,కె.నిరంజన్,ఎస్.కె.షఫి,సంయుక్త కార్యదర్శిగా బి.హైమావతి, కోశాధికారిగా బి.సుప్రియలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## ఏబి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

**కలువాయి డిసెంబర్ 4 ప్రభాతవార్త :** ఏబి క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి పాత కాంప్లెక్స్ సముదాయంలో సిఆర్‌పిలను పని విధానాన్ని కొనసాగించాలని ఏపిసిఆర్‌పి డబ్ల్యూఏ రాష్ట్ర కన్వీనర్ తుమ్మల నాగేశ్వ రరావు పేర్కున్నారు.నాగేశ్వరరావు ఆద్వర్య ంలో



స్దానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం సిఆర్‌ఎంపిలు నల్లరిబ్బన్లు ,బ్యాడ్జిలు నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దారు కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తహసిల్దారు అదే విధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఆత్మగౌరవ దీక్ష ఈనెల 8న అదే విధంగా విజయవాడలో 22 న నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సిఆర్‌ఎంపిలు ఈ కార్యక్రమంలోపాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో సిఆర్‌ఎంపిలు మహేశ్వర్ ,శ్రీహరి, వెంకటేశ్వర్లు,పెంచలయ్య, వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు కలువాయి మండలంను ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నెల్లూరు జిల్లాలో ఉంచాలని స్దానిక యువత చేస్తున్న పోరాటానికి వారు మద్దతు ప్రకటించారు.

## మర్రిపాడులో 10సెం.మీ వర్షపాతం

**మర్రిపాడు,డిసెంబరు4ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా గురువారం 10సెంమీ వర్షపాతం నమోదైందని గుర తహసిల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. వర్షపాతంతో మండలంలో సాగులో ఉన్న పంటలు నీటమునిగాయి. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడి మండల పరిధిలోని వాగులు , వంకలు పొంగి పొర్లాయి. ప్రధానంగా చుంచులూరు వద్దనున్న బొగ్గేరు, మునకంటేరు వాగులు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరికొన్ని గ్రామాల్లో నివాసాల వద్దకు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు చేరి జలకళను సంతరించుకుంది. అయితే మండల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లోని సమాచారాన్ని తెలుసుకుంటూ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## చేజర్లలలో 500 ఎకరాలు నీట మునిగిని నారుమళ్ళు



చేజర్ల డిసెంబర్ 4 ప్రభాతవార్త ద్విత్వా తుపాన్ కారణంగా చేజర్ల మండలంలో సుమారు 500 ఏక రాలల్లో పైగా నారుమళ్ళు నీట మునిగాయని చేజర్ల మండల వ్య వసాయ అధికారిణి హిమ బిందు గురువారం పేర్కున్నారు. ఈ మేరకు ప్రాథమిక నివేదికను జిల్లా అధికారులకు పంపిచినట్లు తెలిపారు. చేజర్ల,మడపల్లి, యనమదుల, కాకివాయి , మాముదూరు,పెళ్ళూరు, ఏటూరు,పాతపాడు గ్రామాలలో నారుమళ్ళు నీట మునిగినట్టు పేర్కున్నారు. అలాగే చిత్తలూరు లో మినుము 30 ఎకరాలలో, నేర్నూరులో 50 ఏకరాలు నీట మునిగాయాని తెలిపారు. ఈమేరకు ప్రాథమిక నివేదిక పంపించినట్లు ఆమె తెలిపారు.

## ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు

### తెలిపిన చైర్‌పర్సన్ సుప్రజా మురళి



**బుచ్చి డిసెంబర్ 4 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటి గుండా వెళ్ళే జాతీయ రహదారి -67పై ( చుంచులూరు నుండి నెల్లూరు వరకు ) లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఢిల్లీలో ఆయన చాంబర్‌లో కలుసుకొని వినతి పత్రం ఇవ్వడం పట్ల బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## త్వరలో పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి

### - రూ.4.80 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం - కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండే ప్రభుత్వమని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆర్‌అండ్‌బి అధికారులు, స్థానిక నేతలతో కలిసి పొట్టేపాలెం కలుజును సందర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలుజు వద్ద వాహనాల రాకపోకలను పరిశీలించారు. త్వరలోనే 4.80 కోట్లతో పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జిని నిర్మిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి పని చేస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో ఎన్నడూ లేని విధంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ శంకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, దేవరపాలెం గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ నేరెళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్‌లో లంగ్ క్యాన్సర్ శస్త్ర చికిత్సల్లో కొత్త దశకు నాంది

### - డాక్టర్ కే.వరుణ్ ప్రకాష్ అధునాతన యూనిపోర్టల్ వ్యాట్స్ సర్జరీ ఫెలోషిప్ పూర్తి



**నెల్లూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త -వైద్యం** తాజా సాంకేతికతలను వేగంగా అందిపుచ్చుకొని ప్రజలకు ఉత్తమ వైద్య సేవలను అందించడంలో మెడికవర్ హాస్పిటల్స్ మరో ముఖ్య ముందడుగు వేసింది. కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కే.వరుణ్ ప్రకాష్ ప్రత్యేకంగా లంగ్ క్యాన్సర్, లంగ్ సంబంధిత వ్యాధుల కోసం రూపొందించిన అడ్వాన్స్‌డ్ మినిమల్ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ ఫెలోషిప్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఫెలోషిప్ ప్రధానంగా ఉపయోగించిన సాంకేతికత యూనిపోర్టల్ వ్యాట్స్ సర్జరీ. సాంప్రదాయ శస్త్ర చికిత్సల్లో ఛాతీలో 10-15 సెం.మీ పెద్ద కోత అవసరం అయ్యేది. అయితే ఈ కొత్త పద్ధతిలో కేవలం 3-4 సెం.మీ చిన్న కోత ద్వారా సర్జరీ పూర్తి చేయవచ్చు. శస్త్ర చికిత్స రిస్క్ తగ్గి. రోగి ఆరోగ్యానికి గణనీయమైన లాభం కలుగుతుంది. డాక్టర్ వరుణ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ చిన్న కోత పద్ధతి లంగ్ శస్త్ర చికిత్సల రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చింది. రోగులకు నొప్పి తగ్గడం, రికవరీ వేగవంతం కావడం, హాస్పిటల్‌లో ఉండే రోజులు తగ్గడం- ఇవి అన్నీ ఈ టెక్నిక్ అత్యుత్తమతను నిరూపిస్తున్నాయి. లంగ్ క్యాన్సర్ బాధితులకు ఇది ప్రత్యేక ఆశాభావాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈ ఫెలోషిప్ ద్వారా డాక్టర్ వరుణ్ ప్రపంచ స్థాయి నిపుణులతో కలిసి పని చేసి, క్లిష్టమైన లంగ్ శస్త్ర చికిత్సలను చిన్న కోతతో అత్యంత ఖచ్చితత్వంతో ఎలా చేయాలి అన్న దానిపై లోతైన శిక్షణ పొందారు. ఈ పద్ధతిలో చేయగల శస్త్ర చికిత్సలు స్మాల్ ఇన్సిషన్ టెక్నిక్‌తో దాదాపు అన్ని రకాల లంగ్ శస్త్ర చికిత్సలను నిర్వహించడం సాధ్యమవుతుంది. లొబెక్టమీలు- లంగ్‌లోని ఒక పెద్ద భాగం తొలగింపు సెగ్మెంటెక్టమీలు- చిన్న సెగ్మెంట్ తొలగింపు వెడ్జ్ రీ సెక్షన్స్- నాన్ క్యాన్సర్/ క్యాన్సర్ గ్రోత్ కోసం చిన్న భాగం తొలగింపు ప్న్యూమోనెక్టమీలు- పూర్తి లంగ్ తొలగింపు మెడియాస్టినల్ లింఫ్ నోడ్ డిసెక్షన్స్- క్యాన్సర్ వ్యాప్తిని అంచనా వేయడంలో కీలకం. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే, నూతన చిన్న కోత పద్ధతి (యు- వీఏటీఎస్) అనేక గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. పాత పద్ధతిలో 10-15 సెం.మీ పెద్ద కోత అవసరం కాగా, నూతన పద్ధతిలో కేవలం 3-4 సెం.మీ చిన్న కోత మాత్రమే అవసరం. దీని ఫలితంగా రోగికి కలిగే నొప్పి గణనీయంగా తక్కువగా ఉండి, రక్తస్రావం కూడా చాలా తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా , రకవరీ సమయం తగ్గి, రోగులు 7-10 రోజుల నుండి 2-3 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. ఈ వేగవంతమైన రికవరీ కారణంగా గాయం త్వరగా మాని, రోగులు తమ జీవనశైలికి, రోజువారి కార్యకలాపాలకు త్వరగా తిరిగి చేరవచ్చు. మొత్తం మీద, ఈ పద్ధతి శస్త్ర చికిత్సా సంక్లిష్టతలను తగ్గించి, క్లీన్ కట్ ద్వారా మెరుగైన ఫలితాలు ఇస్తుంది. హైరిస్క్ రోగులకు కూడా సురక్షితమైన చికిత్సను అందిస్తుంది. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ టి.పవన్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ వరుణ్ ప్రకాష్ అడ్వాన్స్‌డ్ ఫెలోషిప్ పూర్తి చేయడం మా ఆసుపత్రికి గర్వకారణం. లంగ్ క్యాన్సర్ సహా అన్ని లంగ్ వ్యాధుల శస్త్ర చికిత్సలను అత్యాధునిక పద్ధతులతో అందించగలిగే సామర్థ్యం ఇప్పుడు మరింత పెరిగింది. చిన్న కోతతో క్లిష్టమైన లంగ్ సర్జరీలు చేయగలగడం రోగుల జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఈ టెక్నిక్ మా క్యాన్సర్ కేర్ విభాగానికి ఒక కొత్త ప్రమాణం అని అన్నారు.

## జోరువానలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పర్యటన



**ముత్తుకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకవర్గంపై తీవ్రంగా తు ఫాన్ ప్రభావం ఉండడంతో గురువారం జోరువానలో కూడా ము త్తుకూరు మండలం నారికేలపల్లి, వల్లూరు పంచా యతీల్లో ముంపు ప్రాంతాలను సర్వేపల్లి శాసనస భ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటిం చారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల తో ముంపులో వేలాది ఎకరాలు నీట మునిగి రైతు లు నష్టపోయారని అన్నారు. అన్ని మండ లాల పరిధిలో వేలాది ఎకరాల్లో మునిగిపోయిన నారుమ దులు, నారేతలును పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపరిహారం అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుతో పాటు పేదలందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రజలు వర్షా లకు అప్రమత్తంగా ఉండాలని అనవసరంగా బయటకు రాకూడదని సూచించారు. వైసీపీ ప్రభుత్వ హ యాంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆయన బ్యాచ్ పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడంతో ఇరిగేషన్ వ్యవస్థ నాశనమై తీవ్రత నష్టం పెరిగిందని వెల్లడించారు. మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేటి సాయంత్రం వరకు అకడమిక్ ఇన్స్ట్రక్టర్స్ నియామక ధరఖాస్తుల స్వీకరణ

**నెల్లూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త-విద్య** జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు,ఉద్యోగ విరమణతో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో నియామకం చేయదలచిన ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టుల ధరఖాస్తులను నేటి సాయంత్రం వరకు స్వీకరించటం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఆయా మండలాల్లోని మండల విద్యాశాఖ అదికారి కార్యాలయాల్లో ధరఖాస్తులు అందించాల్సి ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్స్‌గా ఎంపికైన వారికి రూ.12500, సెకండరీ గ్రేడ్ అద్యాపకులుగా ఎంపికైన వారికి రూ.10000వేల గౌరవ వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివారాలకు ఆయా మండలవిద్యాశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో కాకాణి పర్యటన



**వెంకటాచలం డిసెంబర్ 4 ప్రభాతవార్త** ప్రభావిత ప్రాంతాల్లో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం పర్యటించారు. మండల పరిధిలోని ఇడమేపల్లి పంచాయతీలోనే పలుకూరి వారి పాలెం లో కొలు చెరువును పంట పొలాలను నీటి మునిగిన నారుములను పరిశీలించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ వర్షాలు కాలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పంట పొలాల్లో నార్మల్ దెబ్బ తింటే కనీసం అధికారులు కూడా పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. రైతులు కష్టపడే చెరువు కట్టకు మరమ్మత్తులు చేయించుకుంటే సోమిరెడ్డి బిల్లులు చేసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్న అదనంగా గుళికలు 550 రూపాయలు హెచ్చించి మొత్తం 900 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయవలసిన దారుణమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకుండా చేయడంతో రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సోమిరెడ్డి ఎన్ని అక్రమ కేసులు బనాయించిన భయపడే ప్రసక్తే లేదుని ముందుండి పోరాడుతామన్నారు. సర్వేపల్లి సుధాకర్ రెడ్డి సతీమణి లీలావతి కర మంత్ర కార్యక్రమాలకు కాకాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు ఎం వెంకట శేషయ్య ఉప ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి ఎంపీటీసీ అంకయ్య ప్రభాకర్ రెడ్డి జగదీష్ తదితరులు పాల్గొన్నారు

## కలువాయిని నెల్లూరులో వుంచాలంటు టిడిపి మద్దతు




**కలువాయి డిసెంబర్ 4 ప్రభాతవార్త** కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటు గత వారం రోజుల నుండి గ్రామంలో అన్ని వర్గాల వారు నిర్వహిస్తున్న తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు కార్యక్రమానికి గురువారం టిడిపి మండల కన్వీనర్ చల్లా రఘురామరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమా వేశంలో పాల్గొన్న మండల నాయకులు ఈకార్యక్రమానికి మద్దతు తెలిపారు.కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్లనే ప్రజలు ఎదుర్కునే సమస్యలను వారు వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.మండలంలోని కూటమి పార్టీలోఉన్న జనసేన,బిజెపి మండల నాయకులు మొదటి నుండే ఈకార్యక్రమానికి సంఘీబావం తెలియజేస్తు అన్ని వర్గాల వారు నిర్వహిస్తున్న నిరసనలో ర్యాలీలో పాల్గొంటు ఉండడం తెలిసిందే.వారిమద్దతు తెలియజేస్తుండడం తెలిసినదే

## మిద్దె పై నిల్వ నీటితో పెచ్చుల ఊకలు

### - ఎంపీడీవో కార్యాలయ భవనం పునరుద్ధరణ అత్యవసరం



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త** మండల ప్రజా పరిషత్ కార్యాలయం భవనం పై భాగంలోని స్లాబ్‌లో పగుళ్ల ఏర్పడి, పెచ్చులు ఊడి కిందపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కార్యాలయానికి వచ్చే ప్రజలకు, సిబ్బందికి ఇది రాను రాను ప్రమాదకరంగా మారే అవకాశముంది. భవనం మిద్దెపై నీరు నిల్వ కావడం, ఆ నీరు నెమ్మదిగా రాడ్ల వరకు చేరడం వలన స్లాబ్ బలహీనపడిందని చూసినవాళ్లు అంటున్నారు. ఈ కారణంగా పెచ్చులు ఊడి పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఐతే ఇది పెద్ద లోపం కాదు తక్షణ మరమ్మతులు చేస్తే భవనం పూర్వస్థితికి రావచ్చు. మిద్దెపై నీరు నిల్వ కాకుండా సరైన డ్రెయినేజ్ ఏర్పాటు చేసి, పగుళ్లను బలపరిచే పనులు చేపడితే భవనం మరింత మన్నికగా మారుతుంది. ఒక్క చిన్న పర్యవేక్షణ - ఒక్క చిన్న మరమ్మత్తు భవనం మళ్లీ ప్రజలకు సురక్షిత స్థలమవుతుంది. ప్రజలు ఉపయోగించే కార్యాలయం కావడంతో, సంబంధిత శాఖ దృష్టి ఈ వైపు త్వరగా మళ్లాలని మీడియా ఫోకస్ సూచిస్తోంది.

## ఘనంగా కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం



**నెల్లూరు,డిసెంబరు4 ప్రభాతవార్త-విద్య** గురువారం నగరంలోని స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ది నెల్లూరు డిస్ట్రిక్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యమ హాసభ మాజీ అధ్యక్షులు ,ఉమ్మడి ఆంధ్రా మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొనిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యమ హాసభ ప్రదాన కార్యదర్శి షేగు షణ్ముగరావు ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రోశయ్య చిత్రపఠానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.షణ్ముగరావు మాట్లాడుతు ఉమ్మడి రాష్ట్రానికి రోశయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. దీనిని ధృష్టిలో ఉంచుకుని రోశయ్య విగ్రహాలాను రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో ఏర్పాటుచేయ్యాలన్నారు. అలాగే నగరంలో కూడా రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, దీని కోసమై రాష్ట్ర మంత్రులు పొంగూరునారాయణ,ఆనం రామనారాయణరెడ్డిలు కృషి చేయాలని కోరారు. 16సార్లు ఉమ్మడి ఆంద్రా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిరని, ఆర్యవైశ్యులను అన్ని విదాల ఆదుకోవటం జరిగిందన్నారు. ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో నేడు రోశయ్య వర్ధంతిని జరుపుకోవటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యమహాసభ నాయకులు కోటా గురుబ్రహ్మం, సురేష్, జొన్నలగడ్డ మెహన్, జిల్లా అధ్యక్షులు గాదంశెట్టి హేమంత్ కుమార్, పచ్చిపులుసు శ్రీరాములు, సతీష్, సురేష్, బాల, శ్రీరాం, కారంశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో డిజిటల్ డెవలప్‌మెంటు కార్యాలయం ప్రారంభం





**కావలి,డిసెంబర్ 4 ప్రభాతవార్త :** పరిపాలన సౌలభ్యం కోసం కావలి మున్సిపల్ కార్యాలయం వెనుకవైపున డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని గురువారం కావాలి ఎమెమల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం కావలిలో తాత్కాళిక డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పది మండలాల అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఈ కార్యాలయం ద్వారానే జరుగుతుందని తెలిపారు. నూతన కార్యాలయ భవనానికి రూ.2.50కోట్లు మంజూరుచేసిన డిప్యూటి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంటు అధికారి కార్యాలయాలను చిత్తూరునుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కావలిలో నూతన భవనానికి స్థలాన్ని కూడా కేటాయించామని తెలిపారు. మండల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కేటసం జిల్లా సిఈఓ వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమీషనర్ శ్రావన్‌కుమార్, ఎంపిడిఓ శ్రీదేవి, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 60 టీయంసీలు దాటిన కండలేరు నీటి మట్టం

### ...జలాశయంలోకి పెద్ద ఎత్తున వరదనీరు



**కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు4 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో నీటి మట్టం గురువారం సాయంత్రానికి 60 టీయంసీలకు చెరుకోంది. భారీ వార్షల కారణంతో పెద్ద ఎత్తున వరదనీరు జలాశయంలోకి వస్తుంది. జలాశయంలో నీటి మట్టం 60 టీయంసీలకు చేరుకోగా వరదనీటి రూపేణా జలా శయంలోకి 27980 క్యూసెక్కుల నీరువస్తుండగా, సోమశిల..కండలేరు వరద కాలువ ద్వారా మరో 1950 క్యూసెక్కుల చొప్పున మొత్తం 29,930 క్యూసె క్కుల నీరుజలాశయంలోకి ఇన్‌ఫ్లోగావస్తుంది. జలాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుండి 50 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ నుండి 1వ బ్రాంచి కెనాల్‌కు 35 క్యూసె క్కులు, పిన్నెరు వాగుకు 2000 క్యూసెక్కులు, త్రాగునీరు నిమిత్తం 5 క్యూసెక్కులు, లీకేజి రూపేణా 260 క్యూసెక్కుల చొప్పునమొత్తం 3880 క్యూసెక్కులు అవుట్ ప్లోగా వెలుతున్నట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు.

## నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే



**వెంకటాచలం డిసెంబర్ 4 ప్రభా తవార్త** తుఫాను కారణంగా నష్ట పోయిన ప్రతిరైతును ఆదుకుం టామని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గురువారం సో మి రెడ్డి పర్యటిం చారు. పూడిపర్తి ఎగువ మెట్ట తాటిపర్తి పాలెం గ్రామాల్లో సోమి రెడ్డి పర్యటించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తా మ న్నారు. భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తిరుమలమ్మ పాలెం కురాకపోకలు నిలిచిపోయాయని, పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ఇరిగేషన్ రెవిన్యూ పోలీస్ అధికారులు సమర్థవంతంగా పనిచేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పిఎస్టి చైర్మన్ రాధాకృష్ణ నాయు డు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూట్ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, పత్రి మల్లికార్జున్, రామకృష్ణారెడ్డి, తది తరులు పాల్గొన్నారు

## ఆత్మకూరు డిడిఒ కార్యాలయం ప్రారంభించిన మంత్రి ఆనం





ఆత్మకూరు,**డిసెంబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచి గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా డివిజనల్ అభివృద్ధి అధికారి (డిడిఓ) కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.గురువారం చిత్తూరు నుంచి వర్చువల్‌గా రాష్ట్రంలోని 77 డిడివో కార్యాలయాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించగా, ఆత్మకూరు నుంచి మంత్రి రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఆత్మకూరులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డిడివో కార్యాలయాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో వర్చువల్‌గా మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు సీఎం చంద్రబాబునాయుడు గారి ఆమోదం మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అత్యంత వేగవంతంగా సఫలీకృతం చేయడం పట్ల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిడివో కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఏర్పాటుచేసేలా, ఒకే తరహా డిజైన్లతో భవనాలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎంకు మంత్రి ఆనం సూచించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనంకు హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ డిడివో కార్యాలయాల ఏర్పాటుతో దశాబ్దాలుగా ఎటువంటి మార్పులు లేని పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టవంతమై ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, వైద్యం, విద్యారంగం పరంగా మొదలైన కనీస వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతమవుతాయన్నారు. మండలాల సమస్యలకు డి డి ఒ కార్యాలయం పరిష్కార వేదిక కానుందన్నారు.
డిడివో కార్యాలయాల ఏర్పాటుతో ఎప్పటి నుంచో ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు లభించడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఆత్మకూరులో తాత్కాలికంగా ప్రభుత్వ భవనంలో డి డి ఓ కార్యాలయాన్ని 11 లక్షలు వ్యయంతో ఫర్నిచర్, ఇతర సామగ్రి సమకూర్చి ఏర్పాటు చేశామని, త్వరలోనే సొంత భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో 50 కోట్ల 48 లక్షలతో 719 పనులు మంజూరు కాగా, కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ఉపాధి హామీ నిధులతో 562 సిమెంట్ రోడ్లకు 34 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఇతర నిధుల ద్వారా 9 కోట్లతో 156 పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ప్రతి మండలానికి కూడా అదనంగా మరో మూడు కోట్లను రహదారుల నిర్మాణానికి మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరామని, అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. 27 కోట్లతో గ్రామాలను అనుసంధానం చేస్తూ ఏడు తారు రోడ్లు మంజూరైనట్లు మంత్రి చెప్పారు. వీర్ల గుడిపాడు గ్రామానికి రాకపోకలు కల్పించేందుకు బీరా పేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 25 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన గ్రామీణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి, ప్రజలకు ప్రభుత్వ పరిపాలన మరింత సౌలభ్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణయ్య, రెవెన్యూ డివిజన్ అధికారి పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోవూరు మండలంలో మోటార్ వైరు దొంగతనాలు విజృంభణ

### రైతాంగం ఆందోళనలో పడుగుపాడు పొలాల్లో దొంగలను వెంబడించిన రైతులపై దాడి



కోవూరు **డిసెంబర్ 4 ప్రభాతవార్త** కోవూరు మండల పరిదిలోని పడుగుపాడు పరిధిలో మోటార్ వైరు దొంగతనం మళ్లీ బీభత్సం సృష్టిస్తోంది. రైతులు పగలూ రాత్రీ పొలాల్లో నిద్రపోయినా, దొంగలు మాత్రం అవకాశాల కోసం గాలిస్తూ పంట సాగునీటి వ్యవస్థలకే పెద్ద ప్రమాదంగా మారారు. చిన్నగా కనిపించే వైరు దొంగతనమే రైతులకు భారీ భారం కడుతోంది. ఈ మధ్యకాలంలో దొంగలు మరింత బలంగా దాడులు చేస్తున్నారన్న ఆందోళన పెరుగుతోంది.గురువారం కూడా గుర్తు తెలియని వ్యక్తి పంట పొలాల్లో నుంచి వైర్ దొంగిలించి రోడ్డు పైన కలుస్తున్న దృశ్యాన్ని చసిన రైతులు ఆవ్యక్తి ని పట్టుకొనే క్రమం లో రైతులను కొట్టి ,నోటితో కొరికి పారిపోయాడు .రైతుల వివరాల ప్రకారం పొలాల్లో మోటార్లకు లాగే ఎలక్ట్రిక్ వైరు మీటర్‌కు దొంగలకు పెడితే 20 రూపాయలకంటే ఎక్కువ రాకపోవచ్చు. కానీ అదే వైరు రైతులు తిరిగి కొనాలంటే కనీసం 120 నుంచి 200 రూపాయల వరకు ఖర్చవుతోంది. పలుచోట్ల మోటార్ దగ్గర 8 నుంచి 10 మీటర్ల వరకు వైరు ఒకేసారి కట్ చేసి దొంగిలిస్తున్నారు. ఒక్కసారి దొంగ ఒక ప్రాంతంలోకి దిగితే ఏకంగా 10 మోటార్ల వరకు వరుసగా కట్ చేయడం సాధారణంగానే మారిపోయింది.ఇక ప్రజలకు నీరు సరఫరా చేసే పంచాయతీ బోర్లకి ఉన్న మోటార్ వైర్లను కూడా ఈ దొంగల బారిన పడుతూ గ్రామాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.రైతులు పోలీసులకు ఇచ్చే ఫిర్యాదులు ఫలితం లేకుండాపోవడంతో చాలామంది తమంత తాము వైర్లు పాడు అయినప్పుడల్లా నష్టాన్ని భరిస్తూ సరిపెట్టుకుంటున్నారు.



**ఒక మోటార్‌ను పైకి లాగాలంటే నలుగురు కావాలి –** రైతుల వేదన వైరు దొంగతనం జరిగినపుడు రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు మరింత పెద్దవి.మోటార్‌ను బావిలో నుంచి పైకి లాగాలంటే కనీసం నలుగురు మనుషులు కావాలి.దొంగతనం జరిగిన రోజే మెకానిక్‌ను రప్పించుకోవడం, కొత్త వైరింగ్ చేయించుకోవడం, కూలీలను సమకూర్చుకోవడం ఇవన్నీ రైతులకు చెమటలు పట్టిస్తున్నాయి.నష్టం, టైమ్ లాస్, కూలీల కోత, పంట నీరుపోక నష్టమవడం.. ఇలా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారురైతులు పొలాల్లో మోటార్ కలపడానికి వెళ్లగా ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు కట్ చేసిన వైర్లను కాల్చుకుంటున్నారు. రైతులు వారిని వెంబడించగా, దొంగలు పరిగెత్తుతూ కొంత దూరం వెళ్లిన తర్వాత తిరిగి వచ్చి రైతులపైనే దాడికి పాల్పడ్డారు.దీంతో రైతులు స్వీయరక్షణ కోసం ఆ దొంగల ఫోటోలను వేగంగా తీసి భద్రపరిచారు.దొంగల ఫోటోలు పోలీసులకు పంపితే రైతులకు భరోసారైతులు తీసిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.ఈ వ్యక్తులు ఎవరో తెలిసిన వారు వెంటనే కోవూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని,రైతులు పడుతున్న బాధలు, ఆర్థికనష్టాలు తొలగించేందుకు పోలీస్ శాఖ ముందుకి రావాలని రైతులు కోరుతున్నారు.వైరుధొంగలను పట్టించి కనీసం భవిష్యత్తులోనైనా ఇలాంటి దొంగతనాలు ఆగాలి. పంటలు కాపాడడానికి రాత్రింబగళ్లు పొలాల్లో కాపలా కాయలేని పరిస్థితి.

## మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు





**కావలి,డిసెంబర్4 ప్రభాతవార్త :** కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంటేరు యువసేన ఆధ్వర్యంలో జలదంకి మండలం లోని బ్రాహ్మణ క్రాక పంచాయితీలో పలు దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు అభిమానులు నిర్వహించారు. బ్రాహ్మణక్రాక టిడిపి కార్యాలయంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు తినిపించుకొన్నారు. 9వమైలు వద్ద ఉన్న వంటేరు వరదారెడ్డి గిరిజన కాలనీలో స్థానికులు 20కిలోల కేక్‌ను కట్‌చేసి ఫోన్ ద్వారా సంతోషాన్ని వ్యక్తపరుస్తూ మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటేరు అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.